క్లుప్తంగా

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దసరా పర్వదినం సందర్భంగా శుక్రవారం హాజీపూర్ గ్రామ పంచాయతీలోని మల్టీపర్పస్ కార్మికులకు దుస్తులు అందజేశారు. ప్రతీ ఏడాది పంచాయతీ కార్మికులకు దసరా సందర్భంగా ఉచితంగా దుస్తులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని అధికారులు తెలిపారు. హాజీపూర్ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, కార్యదర్శి నాగరాజు, కారోబార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కాజిపల్లిలో..

భీమారం: రాష్ట్ర గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని కాజిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు తహసీల్దార్ సదానందం చీరలు పంపిణీ చేశారు. కొమ్ము అశోక్‌యాదవ్, ఎస్సై భూమన్న పాల్గొన్నారు.

మాంసం దుకాణాల ఎదుట బారులు



మటన్‌షాపు ఎదుట బారులుదీరిన జనం

దండేపల్లి: దసరా పండుగ శనివారం రావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లోని పలువురు ఒకరోజు ముందే వేడుకలు జరుపుకున్నారు. శనివారం చాలా మందికి ఒక్క పొద్దులు ఉండటంతో దసరా వేడుకలను శుక్రవారం జరుపుకున్నారు. దీంతో మండలంలోని మటన్‌షాపులు, చికెన్ సెంటర్ల ముందు జనం బారులుదీరారు.

'17లోగా విద్యార్థులు కళాశాలలో చేరాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా కళాశాలలో చేరాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ పీజీ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. రెండు విడతల్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లిష్, ఎంకామ్ కోర్సుల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఆయా కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా తగిన ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99592 69975లో సంప్రదించాలన్నారు.

చర్చిలో 'వన్‌డే రీట్రీట్'



పాటలు పాడుతున్న యువతులు

మందమర్రిరూరల్: మందమర్రిలోని థామస్ (సీఎస్ఐ) చర్చిలో శుక్రవారం వన్ డే రీజనల్ యూత్ రీట్రీట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రీజియన్ చర్చ్ యూత్ సభ్యులు పాల్గొని ఆటపాటలతో అలరించారు. చర్చ్ ఫాస్టర్ జర్మియా మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచినప్పుడే భవిష్యత్ సుఖవంతంగా ఉంటుందని సూచించారు. సీఎస్ఐ చర్చి యూత్ కార్యదర్శి నక్క కమల్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాగజ్‌నగర్, చెన్నూర్, మంచిర్యాల తదితర ఏరియాల్లోని చర్చ్‌ల యువతీయువకులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

బీమా యోజన చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన బోయిని రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం రూ.2 లక్షల ప్రధానమంత్రి బీమా యోజన చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మృతుడు రమేశ్ బ్యాంకులో రూ.420 బీమా చెల్లించడంతో రూ.2 లక్షల చెక్కు మంజూరైందన్నారు. బ్యాంకు సిబ్బంది బాను, పన్నీ విక్రమ్, కొమురయ్య, రాజం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్



ఆర్టీసీ ప్రాంగణంలో నిలిచిన మురుగు నీరు

- అపరిశుభ్రంగా ప్రాంగణం
- గుంతల్లో కూరుకుపోతున్న బస్సులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

చెన్నూర్: జిల్లాలో అత్యధిక ఆదాయం అందించే చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. బస్టాండ్ ప్రాంగణం గుంతలమయంగా మారడంతో ఆర్టీసీ బస్సులు గుంతల్లో కూరుకుపోతున్నాయి. బస్టాండ్ ప్రాంగణంలో పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంపై లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

చెన్నూర్ నుంచి..

చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి చెన్నూర్ మండలంతో పాటు కోటపల్లి, వేమనపల్లి, మహారాష్ట్రలోని సిరోంచ, కాళేశ్వరం మంచిర్యాల, హైదరాబాద్, ఆదిలాబాద్, పరకాల పట్టణాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. బస్టాండ్ నుంచి ప్రతీరోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ ప్రాంగణం పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దుర్వాసనం వెదజల్లుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తాచెదారంతో..

బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయాయి. మరోవైపు ఆర్టీసీ బస్టాండ్‌లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికులతో వచ్చే బస్సులు గుంతల్లో పడుతుండడంతో రోడ్లతో పాటు బస్సులు దెబ్బతింటున్నాయి. గుంతలు ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతల్లో బస్సులు కూరుకుపోతుండడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో ఏర్పడ్డ గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చెత్తాచెదారం నిండిపోయింది. ప్రాంగణంలో ఏర్పడ్డ గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయడంతో పాటు ఆర్టీసీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. – బొగె సారయ్య, చెన్నూర్

భౌభౌలతో బెంబేలు!



వీధుల్లో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

- వీధుల్లో సంచరిస్తున్న శునకాలు
- భయాందోళన చెందుతున్న ప్రజలు

భీమారం: మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రతరమైంది. వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత నెలరోజులుగా వీటి సంచారం ఎక్కువవడంతో పాటు పలువురిని గాయపర్చాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో కుక్కల దాడిలో గాయపడ్డారు. దీంతో వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

నియంత్రణ చర్యలు కరువు..

గతంలో వీధికుక్కల బెడద పెరిగినప్పుడు గ్రామ పంచాయతీ ద్వారా వాటిని నిర్మూలించేవారు. ప్రభుత్వం జంతువులను చంపొద్దని ఆదేశిస్తూ కఠిన చట్టాలు అమలు చేయడంతో కుక్కలను నివారణను గ్రామపంచాయతీ పట్టించుకోవడం లేదు. దీనితో వీధికుక్కలు సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. కాగా ఇతర ప్రాంతాల్లో పట్టిన కుక్కలను వాహనాల్లో తీసుకొచ్చి మండల కేంద్రం శివారుల్లో వదిలి వెళ్తుండడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. అధికారులు చొరవ తీసుకొని కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

'విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లిరూరల్: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో రూ.8లక్షల ఎస్‌డీపీ, జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి వినోద్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్య అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చాకేపల్లి ఎంపీటీసీ మహేందర్, నాయకులు స్వామి, బానయ్య, రవి, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో మహేందర్, ఈడబ్ల్యూఎస్ ఏఈ వినయ్ కుమార్, ఏసీపీ రవి కుమార్, బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెన్నెల: అక్షరాస్యత శాతాన్ని, విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్య పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జూనియర్ కళాశాల అదనపు గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆడ పిల్లలకు మెరుగైన జీవనం కోసం నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదనపు గదుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం కల్లు గీత కార్మికులకు కాటయ్య రక్షక కవచం సేఫ్టీ మోకులను పంపిణీ చేశారు. నాయకులు గట్టు మల్లేశ్, బొమ్మెన హరీశ్‌గౌడ్, శ్రీనివాస్, మల్లాగౌడ్, డీఈవో యాదయ్య, కేజీబీవీ ఎస్‌వో కవిత, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్



సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం రాత్రి జన్నారం మండలం పొన్కల్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీఖాన్, మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల్లో జాన్సన్ నాయక్..

బతుకమ్మ సంబురాలలో భాగంగా మండలంలో బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పర్యటించారు. గురువారం రాత్రి పొన్కల్‌లో జరిగిన బతుకమ్మ సంబురాలతో పాటు ఇందన్‌పల్లి, కలమడుగు, జన్నారం గ్రామ పంచాయతీలలో బతుకమ్మ వేడుకలకు హాజరై మహిళలతో కలిసి ఆడిపాడారు.

కష్టాలు దాటి.. లక్ష్యం చేరి



తోడేటి శ్రీనివాస్



అశోక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏమాత్రం విసుగు చెందకుండా ఓపికతో కష్టపడి చదివి 42 ఏళ్ల వయస్సులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన తోడేటి శ్రీనివాస్. చిలుకమ్మ –రాజాగౌడ్‌లకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఇందులో మొదటి సంతానం శ్రీనివాస్ కాగా 7వ తరగతి వరకు రెగ్యులర్‌గా చదివి కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువులకు స్వస్తి పలికాడు. ఆ తర్వాత చదువుపై మమకారంతో 10వ తరగతి ప్రైవేట్‌గా రాసి ఉత్తీర్ణుడయ్యాడు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీ పూర్తయిన వెంటనే శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే 2008 –2009లో బీఎడ్ పూర్తి చేశాడు. ఇదివరకు పోటీ పరీక్షల్లో విఫలమైనా ఏమాత్రం నిరాశ చెందకుండా భార్య మంజుల ప్రోత్సాహంతో ప్రస్తుత డీఎస్సీలో జిల్లా స్థాయిలో 7వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్, సాంఘిక శాస్త్రం ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం శ్రీనివాస్ కుమార్తె దీక్షిత బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది.

నాడు పశువుల కాపరి..

జన్నారం: మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన సంతపురి చిన్ను –మల్లవ్వల కుమారుడు అశోక్ పశువుల కాపరిగా పనిచేస్తూ ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా ఎంపికయ్యాడు. అశోక్ తండ్రి పశువుల కాపరిగా ఉండేవాడు. అశోక్ ఇంటర్ చదువుతున్న సమయంలో ఆయన తండ్రి అకాల మరణం చెందారు. తరువాత అన్నయ్యలు కష్టపడి చదివించగా, ఇంటికి వచ్చినప్పుడల్లా పశువుల కాపరిగా పని చేసేవాడు. పశువుల కాపరిగా ఉంటూనే పీజీ, బీఎడ్ పూర్తి చేశాడు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్న అశోక్ డీఎస్సీలో ఉద్యోగం సాధించాడు. కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు అశోక్ తెలిపారు.

దుర్గామాతకు ఘనంగా పూజలు



దండేపల్లి: నైవేద్యాలు సమర్పించిన భక్తులు



మంచిర్యాలఅర్బన్: అష్టమి పూజలో బెంగాలీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ కాలక్షేప మండపంలో సర్వజననీ దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి 9 గంటల వరకు అష్టమిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి నవమిపూజలో భాగంగా 108 దీపాలు, 108 తామరపూలు, 9 కలశాల పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బోడ ధర్మేందర్, రీనారాణిదాస్, పవిత్ర, దీపిక బిశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

108 నైవేద్యాలు..

దండేపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు భక్తులు శుక్రవారం 108 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

హాజీపూర్ మండలంలో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా సాగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుడిపేట 13వ ప్రత్యేక బెటాలియన్‌తో పాటు ముల్కల్ల, హాజీపూర్, దొనబండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవి మండపాల్లో అమ్మవారికి పూజలు చేస్తున్నారు.

నవకన్యకా సుహాసిని పూజ..

బెల్లంపల్లి: దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం బెల్లంపల్లిలో సాంప్రదాయబద్ధంగా నవ కన్యకా సుహాసిని పూజను నిర్వహించారు. బాబు క్యాంపుబస్తీలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కనుల పండువగా వేడుకలు జరిపారు. తొమ్మిది మంది కన్నెపిల్లలను దుర్గాదేవి తొమ్మిది ప్రతిరూపాలలో అలంకరించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి, బాల త్రిపుర సుందరి, గాయత్రీ దేవి, అన్నపూర్ణ దేవి, మహాలక్ష్మీ, మహాచండీ, సరస్వతీదేవి, లలితాదేవి, దుర్గాదేవి రూపాల్లో అలంకరించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం, యువజన, మహిళ సంఘాల నిర్వాహకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ఎమ్మెల్యే పూజలు

తాండూర్: దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బోయపల్లి గ్రామంలో దుర్గాదేవిని దర్శించుకున్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: దసరా వేడుకల్లో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పలు దుర్గాదేవి విగ్రహాలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ దర్శించుకున్నారు. దుర్గాదేవి విగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు బస్తీలను ఎమ్మెల్యే కలియ తిరిగారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మునిమంద స్వరూప, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేశ్, డి.రమేశ్, ఆకాశ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, బస్తీ నాయకులు, మహిళలు, భక్తులు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో..

చెన్నూర్: చెన్నూర్ అయ్యప్పస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహిళలు అర్చకులు వేమారం సత్యమూర్తి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చెన్నూర్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



తాండూర్: బోయపల్లిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వినోద్

'సింగరేణిని కాపాడుకోవాలి'



ఎంపీ వంశీకృష్ణను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

కాసిపేట: కార్మికులు, అధికారులు కలిసి సింగరేణిని కాపాడుకోవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీలు వేర్వేరుగా హాజరయ్యారు. అధికారులు, నాయకులు సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. కార్మికులకు ఏర్పాటు చేసిన విందులో ఎంపీ పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. జీఎం దేవేందర్, ఎస్‌ఓటూజీఎం రాజేశ్వర్‌రెడ్డి, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేశ్, ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, గని మేనేజర్ భూశంకయ్య, కాంపెల్లి శంకరయ్య, లక్ష్మణ్ దాస్, దేవి భూమయ్య, సంక్షేమాధికారి జీశాన్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఏర్పాట్లు పూర్తి



చెన్నూర్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చెన్నూర్: పట్టణంలోని గోవారమ్మ ఆలయం వద్ద శనివారం జరిగే దసరా పండుగ కోసం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్, చైర్‌పర్సన్ అర్చనగిల్డాలు తెలిపారు. ఆలయం వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. శమీపూజలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మైదాన ప్రాంతాన్ని చదును చేశారు. ఆలయానికి రంగు వేశారు. కమిషనర్ మాట్లాడుతూ గోవారమ్మ ఆలయం వద్ద నిర్వహించే శమీ పూజకు స్థానిక గాంధీచౌక్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5:30 గంటలకు గాంధీ చౌక్ నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రకు పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం: మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో ఆవరణలో జరిగే దసరావేడుకలకు ఏర్పాట్లు చేశారు.ముఖ్యంగా శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.ముఖ్యంగా గ్రామంలోని ప్రజలు వచ్చి జమ్మి చెట్టు వద్ద పూజ చేసి ఆకులను తీసికెళ్లేందుకు వీలు కల్పించారు.అదేవిధంగా చిత్తడి గా ఉన్న స్థలాన్ని బ్లేడ్ ట్రాక్టరు ద్వారా చదును చేసినట్లు కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు.